
నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, ఆదివారం 13 ఏప్రిల్ 2025 | KARIMNAGAR



స్నాతకోత్సవంలో ఎంబీబీఎస్ విద్యార్థిని గంగుల జాహ్నవికి పట్టా అందిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్, పక్కన ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, కళాశాల చైర్మన్ చల్మెడ లక్ష్మీనరసింహారావు

# నేను డాక్టర్ అయ్యే వాడినే..



- మా నాన్న చెప్పడంతో డిగ్రీలో జాయిన్ అయ్యా
- వైద్య విద్య పేషెన్సీతో చదవాలి
- 'చల్మెడ' స్నాతకోత్సవంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- అట్టహాసంగా వేడుక
- పాల్గొన్న ఎమ్మెల్యేలు గంగుల, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, కళాశాల చైర్మన్ చల్మెడ లక్ష్మీనరసింహారావు

కరీంనగర్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ)/కరీంనగర్ రూరల్: ''మా నాన్న కేసీఆర్ వద్దని చెప్పి ఉండకపోతే నేను కూడా డాక్టర్ అయ్యేవాడిని'' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. తాను డాక్టర్ కావాలనే కోరిక తన అమ్మలో బలంగా ఉండేదని తెలిపారు. శనివారం చల్మెడ ఆనంద రావు మెడికల్ కళాశాలలో జరిగిన స్నాతకోత్సవంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, చల్మెడ మెడికల్ కళాశాల చైర్మన్ చల్మెడ లక్ష్మీనరసింహారావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ''ప్రతి విద్యార్థికి 8,9వ తరగతుల్లో భవిష్యత్తులో ఏం అవ్వాలనే కోరికలను తల్లిదండ్రులే రగిలిస్తారు. నేను డాక్టర్ కావాలని మా అమ్మ బలంగా కోరుకునేది. నేను ఇంటర్ చదివే రోజుల్లో ఇన్ని మెడికల్ కళాశాలలు అందుబాటులో లేవు. మా అమ్మ కోరిక మేరకు కర్నాటకలో అప్పట్లో ఉన్న కేసెట్ రాస్తే, ఫ్రీ సీట్ వచ్చింది. అందుకు మా అమ్మ ఎంతో సంతోష పడ్డారు. అయితే, మా నాన్న మాత్రం మెడిసిన్ చదివితే ఎలా ఉంటుందో చెప్పారు. ఆయన మాటలు విని డిగ్రీలో జాయిన్ అయ్యా'' అని గుర్తు చేసుకున్నారు. మెడిసిన్ అనేది పేషెన్సీతో చదవాల్సి ఉంటుందని, ఏడెనిమిదేళ్లు ఎంతో ఓపికగా చదివిన వైద్య విద్యార్థులకు అభినందనలు చెప్పారు. రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ రూపంలో డాక్టర్లకు పెద్ద సవాల్ ఎదురవబోతున్నదని చెప్పారు. చాట్ జీపీటీ, గ్రోక్‌లు ప్రిస్కిప్షన్లు కూడా రాస్తున్నాయని, ఏఐ ఇచ్చే సమాచారం ఆధారంతో చాలా మంది పేషెంట్లు డాక్టర్ల వద్దకు వస్తున్నారని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఇలాంటి పేషెంట్లను చాలా జాగ్రత్తగా హ్యాండిల్ చేయాల్సి ఉంటుందన్నారు. కరుణ, దయ, సానుభూతితో రోగులకు వైద్యులు సేవలు అందించాలని కోరారు. వైద్యరంగంలో తెలంగాణ సాధించబోయే ప్రగతిలో వైద్యులందరూ భాగస్వామ్యులు కావాలని విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ 2019లో తన కూతురు జాహ్నవితో కలిసి హైదరాబాద్‌కు కౌన్సెలింగ్ వెళ్లానని, అక్కడ చల్మెడ మెడికల్ కళాశాల గురించి గొప్పగా మాట్లాడుకోవడం విని తన కూతురు కోసం ఈ కళాశాలను ఎంపిక చేసుకున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోనే చల్మెడ మెడికల్ కళాశాలకు మంచి పేరున్నదన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలతో మెడికల్ విద్యా అవకాశాలు మెరుగుపడ్డాయని, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడం గర్వకారణమన్నారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల మాట్లాడుతూ మెడికల్ విద్యార్థులు ఒక విజన్‌తో ముందుకు వెళ్లాలని సూచించారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తారని, వారితో పాటు గురువులు కూడా ఎంతో ఓపికగా విద్యను అందిస్తారని, వీరిని ఎప్పటికీ మర్చి పోవద్దని సూచించారు. ఈ స్నాతకోత్సవ సభలో ఇంకా చల్మెడ లక్ష్మీ నరసింహారావు తదితరులు మాట్లాడారు. సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు, వారి తల్లి దండ్రులు కూడా ఈ సందర్భంగా తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఇక్కడ మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ వీ సూర్యానారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆసిం అలీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీ అనిత పాల్గొన్నారు.



స్నాతకోత్సవానికి హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

## రామగుండం @ 40 డిగ్రీలు



నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

కోల్‌సిటీ, ఏప్రిల్ 12 : పెద్దపల్లి జిల్లా రామగుండం శనివారం అగ్ని గుండంగా మారింది. నిప్పుల దగడుకు జనం బెంబేలెత్తిపోయారు. గరిష్టంగా 40 డిగ్రీలు నమోదు కాగా, ఉదయం నుంచే అడుగు బయట పెడితే అగ్గే అన్నట్టు తయారైంది. తెల్లవారింది మొదలు... చీకటి పడేదాకా ఒకటే వేడి. ఇంట్లో ఉండలేని పరిస్థితి.. బయటకెళ్లలేని దుస్థితి ఎదురైంది. కనిష్టంగా 26.4 డిగ్రీలు నమోదయ్యాయి. రెండు రోజుల క్రితం గరిష్టంగా 38.4 డిగ్రీలు ఉండగా, శనివారం ఒక్కసారిగా 40 డిగ్రీలకు చేరుకోవడంతో ఎండ వేడిమికి తాళలేక ప్రజలు ఉక్కిరి బిక్కిరయ్యారు. దీంతో పగటిపూట గోదావరిఖనిలోని రోడ్లన్నీ అప్రకటిత కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించాయి.



బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, వొడితల సతీశ్‌కుమార్, పుట్ట మధూకర్, పార్టీ జిల్లాల అధ్యక్షులు జీవీఆర్, విద్యాసాగర్‌రావు, కోరుకంటి చందర్, తోట ఆగయ్య, ఉమ్మడి జిల్లా నాయకులు

# ఏడాదంతా రజతోత్సవ సంబురం

- 27న చరిత్రలో నిలిచిపోయేలా బీఆర్ఎస్ సభ నిర్వహిస్తాం
- కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం
- సభ తర్వాత పార్టీ సంస్థాగత కార్యక్రమాలు
- సుశిక్షితులైన కార్యకర్తలను తయారు చేస్తాం
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఎల్కతుర్తి సభకు జనసమీకరణపై ఉమ్మడి జిల్లా నాయకులతో సమీక్ష

**బీఆర్ఎస్ 25వ వసంతంలో అడుగిడుతున్న సందర్భంగా ఈ ఏడాదంతా సంబురాలు నిర్వహిస్తామని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే పార్టీ రజతోత్సవ సభను చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహిస్తామని చెప్పారు. ఈ మేరకు ఈ సభకు జన సమీకరణపై ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షా సమావేశంలో పాల్గొనేందుకు శనివారం కరీంనగర్ వచ్చిన ఆయన, ముందుగా విలేకరులతో మాట్లాడారు.**

కరీంనగర్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ఏడాదంతా రజతోత్సవ సంబురాలు నిర్వహిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. ఈ ఏడాది తమ పార్టీకి చాలా కీలకమైన సంవత్సరం కాబోతున్నదని, తమ పార్టీకి 24 ఏండ్లు నిండి 25వ ఏట అడుగు పెట్టడం అంటే సామాన్యమైన విషయం కాదని అన్నారు. పార్టీ ఆవిర్భావంలో ఎన్నో అవమానాలు, శాపనార్థాలు ఎదుర్కొన్నామని గుర్తు చేశారు. పదవుల కోసం పార్టీ పెట్టారని అన్నారని, కేసీఆర్, ఆయనతో నడిచిన సహచరులు ఎన్నో అడ్డమైన మాటలు పడాల్సి వచ్చిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎన్నో పార్టీలు పుట్టాయని, అనతి కాలంలోనే కనుమరుగయ్యాయని, తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్ స్థాపించిన పార్టీ తెలుగు దేశమని, తెలంగాణ అస్థిత్వాన్ని, తెలంగాణ భాష, యాస, సంస్కృతిని చాటుతూ కేసీఆర్ నాయకత్వంలో ఏర్పడిన పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితిగా ఏర్పడిన ఈ పార్టీ ఇప్పుడు భారత రాష్ట్ర సమితిగా మారవచ్చుగానీ, జెండా మారలేదని, ఎజెండా మార లేదని, నాయకుడు మారలేదని, గుర్తు కూడా మారలేదని చెప్పారు. తెలంగాణ ఇంటి పార్టీగా, మన పార్టీగా బీఆర్ఎస్ ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచిందన్నారు. ప్రతి సంవత్సరం ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్నట్లుగానే 25 ఏండ్లు నిండుతున్న సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఎల్కతుర్తిలో రజతోత్సవ వేడుకలు నిర్వహించుకోబోతున్నామని తెలిపారు. సభకు వచ్చేందుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రతి ఊరి నుంచి, కార్యకర్తల నుంచి విపరీతమైన ఒత్తిడి ఉందని, దాదాపు 60 లక్షల సభ్యత్వం ఉన్న పార్టీ తమదని, ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే లక్షలాది మందితో సభ నిర్వహిస్తామనే విశ్వాసం తమకు కలుగుతోందని ధీమా వ్యక్తం చేశారు.

### మే నెలలో సభత్వ నమోదు

ఏడాది పాటు బీఆర్ఎస్ రజతోత్సవ సంబురాలను నిర్వహించబోతున్నామని, ఈ సందర్భంగా ఉద్యమంలో పాల్గొన్న వారిని ఒక్కతాటిపైకి తేవడం, ఉద్యమ సమయంలో జరిగిన వివిధ కార్యకలాపాలు ప్రజలకు గుర్తు చేసేందుకు కొన్ని కార్యక్రమాలను తీసుకుంటున్నామని కేటీఆర్ తెలిపారు. సభ తర్వాత మే నెలలో పార్టీ సభ్యత్వ నమోదు తిరిగి ప్రారంభిస్తున్నామని, ఈసారి పుస్తకాలు కాకుండా యాప్ ద్వారా డిజిటల్ సభ్యత్వ నమోదు చేయబోతున్నామని స్పష్టం చేశారు. సభ్యత్వ నమోదైన తర్వాత దసరాలోగా గ్రామ, పట్టణ, వార్డు, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి కమిటీల ఎన్నికలు నిర్వహించబోతున్నామన్నారు. ఆ తర్వాత రాష్ట్ర అధ్యక్ష పదవికి కూడా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నిక నిర్వహించబోతున్నామని తెలిపారు. అన్ని జిల్లాల్లో ఉన్న పార్టీ కార్యాలయాల నుంచే ఇక ముందు కార్యకలాపాలు నిర్వహించబోతున్నామన్నారు. అలాగే, ప్రతి నియోజకవర్గానికి సుశిక్షితులైన 500 మందిని ఎంపిక చేసి పూర్తి స్థాయిలో శిక్షణ ఇస్తామని అన్నారు. పదకొండేళ్లుగా బీజేపీ చేస్తున్న అరాచకం, గత 16 నెలలుగా కాంగ్రెస్ చేస్తున్న దుర్మార్గ పాలనపై ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్ సాధించిన విజయాలు, రాష్ట్రాన్ని సాధించిన వైనంపైనా, అందుకు చేసిన పోరాటాలు, త్యాగాలపైనా శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఎలాంటి పాలన అందించింది, మన భాష, సంస్కృతిపైనా గతంలో ఎలాంటి దాడులు జరిగాయనే విషయం, తెలంగాణ సాంస్కృతిక సారథి ఏర్పాటు ఎలా జరిగిందనే విషయాలపైనా శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు వస్తే సమర్థవంతంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

### మిడ్ మానేరు ఎడారిలా కనిపిస్తోంది

ఎల్ఎండీ, మిడ్‌మానేరులో 7 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయని, తంగళ్లపల్లి వంతెన మీదుగా చూస్తే మిడ్ మానేరు ఎండి ఎడారిలా కనిపిస్తోందని కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇదే ఏప్రిల్, మే నెలల్లో చెరువులు మత్తళ్లు దుంకిన విషయాన్ని గుర్తు చేశారు. ఎర్రటి ఎండల్లోనూ అప్పర్ మానేరు నుంచి మంథని వరకు మానేరు ఒక సజీవ జలధారలా కనిపించేదని అన్నారు. వరద కాలువను కోరుట్ల నుంచి హుజూరాబాద్ అవతలి వరకు ఒక సజీవ జల ధారలా మార్చిన విషయాన్ని గుర్తు చేసుకోవాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అద్భుతమైన పంటలు పండాయన్నారు. కేవలం కేసీఆర్‌పై కోపంతో గుడ్డి వ్యతిరేకతతో, మేడిగడ్డ కొట్టుకు పోయిందని ఎన్నికల్లో చిల్లర ప్రచారం చేశారని, ప్రాజెక్టుకు 370 పిల్లర్లు, మూడు బ్యారేజీలు, 19 రిజర్వాయర్లు, 21 పంప్ హౌస్‌లు, వందల కిలో మీటర్ల సొరంగ మార్గం, ప్రవాహ కాలువలు ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టును పట్టుకుని ఒక్క పిల్లర్ పర్రె పడినంత మాత్రాన అబద్ధపు ప్రచారం చేశారని తెలిపారు. ఆయన దున్నపోతు ఈనింది అంటే ఈయన దుడ్డెను కట్టేయమన్నట్లు, పరిస్థితి ఉందన్నారు. ఎన్‌డీఎస్‌ఏ ఢిల్లీ నుంచి నీళ్లల్ల దిగకుండా, కనీసం కిందికి వెళ్లి చూడకుండా ఏదో అయిపోయిందన్నట్లు 48 గంటల్లో కేంద్ర ప్రభుత్వం నివేదిక ఇచ్చిందని తెలిపారు. మేడిగడ్డ మీద 48 గంటల్లోనే రిపోర్టు ఇచ్చిన కేంద్రం సుంకిశాల రిటర్నింగ్ వాల్ కూలిపోతే ఒక్క బీజేపీ నాయకుడు ఎందుకు మాట్లాడడం లేదని, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిపోయి 8 మంది చనిపోయినట్లు వార్తలు వస్తున్నా కేంద్ర ప్రభుత్వం మాత్రం దున్నపోతు మీద వాన పడినట్లుగానే ఉందన్నారు. ఎన్‌డీఎస్‌ఏ రాదు, రాష్ట్రంలో జరుగుతున్న తప్పులపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. దీనిని బట్టి కాంగ్రెస్, బీజేపీలు కలిసి కేసీఆర్‌ను బద్నాం చేయాలని చూస్తున్నట్లు స్పష్టంగా అర్థమవుతోందని, కానీ అది ఎప్పటికీ నెరవేరదని కేటీఆర్ స్పష్టం చేశారు. మేడిగడ్డ పిల్లర్ కుంగి ఇప్పటికి 16,17 నెలలు అవుతోందని, మేడిగడ్డకు దగ్గరలోనే భూకంపం వచ్చిందని, అతి భారీ భూకంపాన్ని తట్టుకొని నిలబడిందని, 28 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా తట్టుకొని నిలబడిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మరో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, పార్టీ జిల్లాల అధ్యక్షులు జీవీ రామకృష్ణారావు, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కోరుకంటి చందర్, తోట ఆగయ్య, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, సతీశ్‌కుమార్, దాస రి మనోహర్‌రెడ్డి. పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయంలో చాంబర్‌లో కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావును కూర్చోబెట్టి పుష్పగుచ్ఛం అందిస్తున్న కేటీఆర్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, నాయకులు



జెండా ఎగురవేసి నినదిస్తున్న కేటీఆర్, పక్కన ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి

## 'వక్ఫ్' సవరణ చట్టాన్ని రద్దు చేయాలి




కమాన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

తెలంగాణచౌక్, ఏప్రిల్12: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు నగరంలోని కమాన్ చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సృజన్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మత స్వేచ్ఛను హరించేలా వక్ఫ్ బోర్డు చట్టాన్ని సవరించి ముస్లిం మతాచారాల్లో జోక్యం చేసుకుంటున్నదని ఆరోపించారు. దీనికి దేశవ్యాప్తంగా పార్టీలు, ప్రజాసంఘాలు వ్యతిరేకించినా టీడీపీ, జేడీయూ సహకారంతో బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించడం సరికాదన్నారు. ముస్లిం మైనార్టీలను అణిచివేయాలని కేంద్రం కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. మైనార్టీల అభివృద్ధి అడ్డుగోడగా ఉన్న వక్ఫ్ బోర్డు సవరణచట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ఆ పార్టీ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు పైడిపల్లి రాజు, బుచ్చన్నయాదవ్, రవి, సాహిమ్ బేగం, రజియా సఫిన్, సుల్తానా పాల్గొన్నారు.



కొండగట్టుకు మాల విరమణ కోసం తరలివచ్చిన దీక్షాపరులు

## 'కొండ'ంత జనం

- వేలాదిగా తరలివచ్చిన దీక్షాపరులు
- వైభవంగా హనుమాన్ చిన్న జయంతి

మల్యాల, ఏప్రిల్ 12: వేలాది మంది హనుమాన్ మాల దీక్షాపరులతో కొండగట్టు కాషాయమయమైంది. రామ లక్ష్మణ జానకీ.. జై బోలో హనుమాన్‌కీ.., శ్రీ రామ జయ రామ, జయ జయ రామ.. అను రామ నామ సంకీర్తనలతో మార్మోగిపోయింది. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం అర్ధరాత్రి వరకు సైతం ఉప్పెనలా తరలివచ్చిన వేలాది మంది దీక్షాపరులు మాల విరమణ చేసి, అంజనేయ స్వామిని దర్శించుకున్నారు. రామ నామ స్మరణలు, హన్మాన్ చాలీసాలు, అంజనేయ స్వామి దండకాలు, ఆటపాటలతో భక్తిపారవశ్యంలో మునిగితేలారు.

## ఊరూరూ.. కదలిరావాలి

- బీఆర్ఎస్ రజతోత్సవాన్ని సక్సెస్ చేయాలి
- మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి
- జూలపల్లిలో ఛలో వరంగల్ పోస్టర్లు విడుదల
- కార్యకర్తలతో సన్నాహక సమావేశం



వాల్ పోస్టర్లు విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, రఘువీర్‌సింగ్, నాయకులు

జూలపల్లి, ఏప్రిల్ 12: 'బీఆర్ఎస్ రజతోత్సవ కార్యక్రమానికి ప్రతి ఊరు నుంచి కదలిరావాలని, బహిరంగ సభను సక్సెస్ చేయాలని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పార్టీ ముఖ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో 27న నిర్వహించనున్న రజతోత్సవ వేడుకల సందర్భంగా శనివారం జూలపల్లిలోని 'గోల్డెన్ ఫంక్షన్ హాల్'లో ఛలో వరంగల్ వాల్ పోస్టర్లను విడుదల చేసి, సన్నాహక సమావేశంలో కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసి మాట్లాడారు. కార్యకర్తలు, రైతులు, అభిమానులు, మాజీ ప్రజాప్రతినిధులు తెలంగాణ ఆత్మ గౌరవం కోసం సభకు తరలివెళ్లాలని పేర్కొన్నారు. అనేక హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వం పని తీరును చూస్తున్న ప్రజలు ఛీకొడుతున్నారనీ, అప్పటి బీఆర్ఎస్ పాలనే బాగుందని విశ్వసిస్తున్నారని తెలిపారు. పోరాడి రాష్ట్రాన్ని తెచ్చి అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించిన కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలు ఎప్పటికప్పుడూ ఎండగట్టి ప్రజల పక్షాన నిలబడాలని, త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటడానికి ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, ఏఎంసీ మాజీ చైర్మన్ కంది చొక్కారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు తమ్మడవేని మల్లేశం, కత్తెర్ల శ్రీనివాస్, మాజీ కోఆప్షన్ సభ్యుడు లాల్ మహ్మద్, గ్రామ కమిటీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ ఉద్యోగోన్నతుల్లో

## అక్రమాలపై విచారణ జరపాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 12 : ఉమ్మడి జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపడుతున్న ఉద్యోగోన్నతుల్లో అక్రమాలపై ఉన్నతాధికారులు విచారణ జరుపాలని, అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సమ్మయ్య డిమాండ్ చేశారు. నగరంలోని ఆసంఘం జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా టీచర్లు, ఆయాల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అర్హులైన వారిని పక్కన బెట్టి, అనర్హులకు ఆయాల నుంచి టీచర్లుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తున్నారని మండిపడ్డారు. మెడికల్ టెస్టుల పేర అనేక మంది ఆయాలను ఇబ్బందులకు గురిచేస్తూ, వారిని విధులు నిర్వహించకుండా అధికారులు కట్టడి చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ తతంగం వెనుక లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయని ఆరోపించారు. దీనిపై ఆ శాఖాధికారులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కలెక్టర్ జోక్యం చేసుకుని వాస్తవాలు సేకరిస్తే ఆశాఖలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు వెలుగులోకి వస్తాయన్నారు. అర్హులైన ఆయాలకు టీచర్లుగా ఉద్యోగోన్నతులు కల్పించకపోతే కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పలు మండలాల నుంచి వచ్చిన అంగన్‌వాడీ కేంద్రాల ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.